# దూరపు కొండలు

ఒంగోల్ బస్‌స్టాండ్‌లో దిగి ఆటో మాట్లాడుకుని యింటికి వెళ్తున్న ముత్తయ్య మనసులో సముద్రపు అలల్లా ఎగసిపడ్తున్న ఆనందం... భార్య దుర్గని చూసి దాదాపు రెండేళ్ళు. ఎంతందంగా ఉంటుందో దుర్గ... చారడేసి కళ్ళు... కాటుక దిద్దటంవల్ల మరింత విశాలంగా కన్పిస్తాయి. రంగు చామనచాయైనా ఎంత కళగా ఉంటుందో... పెళ్ళయ్యాక ఆర్నెల్లకే తను దుబాయ్ వెళ్ళాడు. ఏం బతుకులో... తన వాళ్ళని వదిలేసి పరాయిదేశంలో కూలిపనిలో చేరి... తమ సంపాదనలోంచి కాసిని డబ్బులు దాచిపెట్టడం కోసం దుబాయ్‌లో ఎంతటి దుర్భరమైన, నికృష్టమైన బతుకు బతకాల్సి వస్తుందో దుర్గకి తెలిస్తే మళ్ళా వెళ్ళనిస్తుందా... అమ్మకి తెలిస్తే ఆమె గుండె పగిలిపోదా... అందుకే తను చెప్పడు. ప్రాణం పోయినా సరే...

తన వెంట తెచ్చిన రెండు బరువైన సూట్ కేసులవైపు తృప్తిగా చూసుకున్నాడు. దుర్గ కోసం కొన్న చీరలు... అమ్మా నాన్నల కోసం కొన్న బట్టలు... ఎలక్ట్రానిక్ వస్తువులు... వీటిని చూస్తే తన నేస్తాలు తనేదో దుబాయ్‌లో దర్జాగా బతుకుతున్నాననుకుంటారు. వాళ్ళకేం తెలుసు... తనెన్ని కష్టాలకోర్చి ఈడబ్బు కూడబెట్టాడో... దుబాయ్‌లోని ధనవంతుల యిళ్ళలో ఉండే టాయిలెట్లకన్నా చిన్న గది...అందులో ఐదుగురు... ఒకర్ని ఒకరు తాకుతూ... ఒకరి మీద ఒకరు పడిపోతూ... ఆ గదినీ.. అందులో తనతోపాటు పడి నిద్రరాక దొర్లుతున్న మిగతావాళ్ళని చూసినపుడు ఎన్నిసార్లు బురదలోపొర్లే పందులు గుర్తొచ్చాయో... ఎన్ని రాత్రుళ్ళు తిండి లేకుండా కడుపులోకి కాళ్ళు ముడుచుకుని పడుకుని డబ్బులు వెనకేయాల్సి వచ్చిందో...

యిల్లు దగ్గరయ్యేకొద్దీ అతను దుబాయ్‌లో భవన నిర్మాణ కూలీగా అనుభవించిన

సరదానన్నంతా మర్చిపోయాడు. ఆటో శబ్దానికి అతని తల్లి రాజమ్మ యింట్లోంచి బైటికొచ్చింది. ఆమె వెనకే దుర్గ...

"అమ్మా ఎలా ఉన్నావే... బావున్నావా... అయ్యేడీ... నేనొస్తానని తెల్వదా" అమ్మను దగ్గరకు తీసుకుంటూ అడిగాడు.

రాజమ్మకు కొడుకుని చూడగానే దుఃఖం పొంగుకొచ్చింది. కొడుకు తనని దగ్గరకు తీసుకుని బావున్నావా అనగానే యిన్నాళ్ళుగా ఘనీభవిస్తూ వచ్చిన హిమశిఖరం ఆత్మీయ కిరణస్పర్శతో కరిగిపోయినట్లు కన్నీళ్ళ కాసారమైంది.

"ఎట్టా సిక్కిపోయావో సూడు... బొమికలు అగిపిస్తున్నాయి. తిండీ తిప్పలు ల్యాకుండా ఏంకొలువు సేత్తున్నావయ్యా... ఔన్లే... మన వూరా పాడా... నీ యిసయాలు పట్టించుకునేటోళ్ళు ఎవురున్నార్లే... లోనికి పద. మీ అయ్య పొలంకాడికెల్లాడు. కబురెడ్తే ఛనంలో వత్తానన్నాడు" అంది చీర చెంగుతో కళ్ళొత్తుకుంటూ.

దుర్గ వైపు చూసి కళ్ళతోనే బావున్నావా అన్నాడు. దుర్గ ముసిముసిగా నవ్వింది.

స్నానానికి నీళ్ళు తోడాక, తడికల్తో కట్టిన స్నానాల గదిలోకి వెళ్ళబోతున్న ముత్తయ్యతో "బూబమ్మ నీకోసరం మూడుచుట్లు తిరిగిపోయింది. నువ్వు రాంగానే కబురెట్టమంది" అందిదుర్గ.

"బువ్వ తిన్నాక నేనే ఎల్లి మాట్లాడి వత్తాలే"

"నీతోపాటు ఖాజా అన్న వత్తాడని బూబమ్మ వారం నుండీ ఎదురు సూత్తోంది తెల్సా? నువ్వొత్తున్నావని మీ అమ్మ సెప్పినకాడ్నించి ముసిల్ది ఎంత ఆదుర్దా పడిపోతోందో"

"వచ్చేవాడైతే ఉత్తరం రాసేటోడుగా"

"ఉత్తరం గిత్తరం లేకుండానే కొడుకొత్తాడని బూబమ్మ ఆశ. పాపం నాకే జాలేసింది. నీతో పాటు ఖాజా అన్న కూడా రావొచ్చుగా. శెలవ దొరకలేదా"

తన భార్య అమాయకత్వానికి నవ్వొచ్చిందతనికి. "మేం సేసేవి గవుర్నమెంట్ ఉజ్జోగాలా· ఏంటే శెలవలివ్వడానికి? కూలి దొరికిన రోజు సేతిలో డబ్బులు ... ల్యాకపోతే పస్తులు. అంత దూరం ఎల్లిందే నాలుగు రూపాయలు ఎనకేసుకుందామని. సీటికి మాటికి రావాల్నంటే కుదురుద్దా ... ఎంత డబ్బు కర్సవుద్ది?"

"రెండేళ్ళకోమారు రావడం కూడా కట్టమేనా...మరి నువ్వెందుకొచ్చావు? నీవాల్లని సూస్కుందామనే కదా"

"నాకంటే పెల్లయింది. మాంచి వయసులో సొగసుగా ఉన్న పెల్లాం గుర్తొచ్చి లగెత్తుకుంటా వచ్చినా. ఖాజాకేముంది సెప్పు.. సూదంటు రాయిలా లాగడానికి"

"అదేమ్మాట.. సాకి సంతరించిన తల్లుందిగా... బూబమ్మకైనా యింకెవులున్నారు? ముసలి తల్లిని సూస్కోవాల్సిన బాద్యత లేదా... ఖాజా అన్న రానీ.. నేనే నిల్దీసి అడుగుతా"

"ఆ ముసలి తల్లి బాగ్గోసమేగా వాడక్కడ యాతన పడ్తున్నాడు. మీకియన్నీ అర్దమయ్యే యిసయాలు కాదులేవే" అతను తువ్వాలు భుజాన వేసుకుని స్నానాల గదిలోకి నడిచాడు.

'ఏంటో యిదంతా. పెల్లయితే పిచ్చి కుదురుద్ది... పిచ్చి కుదిర్తే పెల్లవుతుందిలా ఉంది. సంపాదన ముసిల్దానికోసమే ఐనా రెండేల్లకోమార్రైనా తన కొడుకుని సూస్కోవాలని ఆ తల్లి కుండదా... డబ్బులు పంపిత్తే సరా... ఈ మగాల్లకెపుడు తెలిసేడ్సింది ఆడదాని మనసు' అంటూ గొణుక్కుంది దుర్గ.

ముత్తయ్య స్నానం చేసొచ్చి భోజనానికి కూచున్నాడు. దుర్గ వడ్డించిన వరన్నం, కోడికూర తింటుంటే అమృతంలా ఉంది. స్వర్గంలో ఉన్నట్లు... యింత రుచికరమైన భోజనం తిని ఎన్నేళ్ళయిందో... రాజమ్మ కొడుకు పక్కన పీట వేసుకుని విసనకర్రతో విసుర్తూ కూచుంది.

"యింకాస్త కూరేసుకో... రెండు ముక్కలు ఆడి కంచంలో ఏయవే" కోడల్ని పురమాయించింది రాజమ్మ.

"ముత్తయ్యేడీ... లోపలున్నాడా" అంటూ బూబమ్మ వచ్చింది.

'నే సెప్పలా... ముసిల్దాని ఆరాటం' అన్నట్టు చూసింది దుర్గ.

"రా పెద్దమ్మా... బావున్నావా..." నవ్వుతూ పల్కరించాడు.

"యిదిగో యిలా ఉన్నా నాయనా... కొడుక్కోసం కల్లలో వత్తులేస్కుని సూత్తున్నా. ఆడికోసం పేనాలు నిలుపుకుని బతికేత్తున్నా. నీతోపాటు వత్తాడనుకుంటే రాలేదేం? ఈ తల్లిని మర్చిపోయాడా వాడు?"

బూబమ్మ నిలబడే మాట్లాడుతోంది. మధ్య మధ్యలో కన్నీళ్ళు తుడుచుకుంటోంది.

"పెద్దమ్మా... మొదట నా పక్కన కూసో... దుర్గా. యింకో కంచం పెట్టి పెద్దమ్మకు కూడా వడ్డించు" అన్నాడు.

"వద్దులే నాయనా... ఈ వయసులో తిన్నా అరాయించుకోలేను. ఖాజా ఎలా ఉన్నాడు? ఎప్పుడొత్తానన్నాడు? నీతోపాటు ఎందుకు పిల్సుకు రాలేదు?" ముత్తయ్య పక్కన కూచుంటూ అడిగింది.

"అన్నీ యివరంగా సెప్తా గాని మొదట నాతోపాటు బువ్వ తిను"

"ఆకల్లేదు.. తినాలని లేదు. ఒకే కోరిక... నాకొడుకుని సూడాలని. బిడ్డ నాకోసం అక్కడ ఎంత కట్టపడిపోతున్నాడో తల్సుకుంటే కడుపు తరుక్కుపోతుందయ్యా."

"ఐతే నాకూ వద్దులే" అలిగినట్టు కంచం దూరంగా జరిపాడు.

"నా అయ్యే... మా నాయనే... సిన్నప్పుడు నువ్వూ ఖాజా యిలాగే అలిగేటోళ్ళు. సరే. నేనూ కొంచెం తింటాలే" అంది మనసారా సంతోషపడ్తూ.

"కన్నతల్లిని పక్కనే ఉన్నా గదరా...నన్నడిగావా బువ్వ తినమని? మీ పెద్దమ్మని తినమంటున్నావే. ఎట్లయినా నీకు బూబమ్మంటేనే పేమ ఎక్కువరా" రాజమ్మ హాస్యమాడింది.

"నా సిన్నప్పుడు పెద్దమ్మ నాకూ ఖాజాకి ఒకేకంచంలో బువ్వ కలిపి ముద్దలు తిన్పించిన యిసయం ఎలా మర్సిపోగలనమ్మా. నిన్ను సూస్కోడానికి అయ్యున్నాడు. దుర్గ ఉంది. పెద్దమ్మకెవులున్నారు సెప్పు? ఖాజా నేనేగా... ఖాజా రాలేకపోయాడు కాబట్టి పెద్దమ్మకు ఏ లోటూ రాకుండా సూస్కోవాల్సిన డూటీ నాదేగా"

"నిన్ను సూత్తుంటే... నీ మాటలు యింటుంటే ఖాజాని సూసినంత తృప్తిగా ఉందయ్యా. ఐనా ఖాజా వచ్చుంటే బాగుండేదిగా" మళ్ళా కన్నీళ్ళు తుడుచుకుంటూ అంది.

భోజనాలైనాక ముత్తయ్య మంచం మీద కూచుని తను తెచ్చిన సూట్ కేస్ తెరిచాడు. "పెద్దమ్మా... బువ్వ తినేసి నేనే వద్దామనుకున్నా. నువ్వే వచ్చేశావు. యిట్రా. నీకోసరం ఖాజా ఏమేం పంపించాడో సూడు"

బూబమ్మ ముత్తయ్య పక్కకెళ్ళి కూచుంది.

"యిది రగ్గు... రాబోయేది సలికాలం కదా. నీకు ఎచ్చగా ఉండాలని పంపించాడు. సూడెంత బాగుందో... ముట్టుకుంటే మల్లెపూవులా ఎంత మెత్తగుందో.. యిది స్వెట్టర్.. నీకు గులాబీ రంగంటే యిట్టం కదా. అందుకే ఆ రంగుదే కొన్నాం. ఆడితో పాటు షాపింగ్‌కి నేనూ ఎల్లాలే. ఎండలో ఎల్లాల్సి వస్తే ఈ గొడుగేసుకునే ఎల్లమన్నాడు. యివిగో మూడు సీరెలు... నువ్వు సల్వార్ కమీజ్ ఏస్కోవుగా... దుబాయ్‌లో ముస్లిం ఆడోల్లు అవే వాడ్తారు. నీకు అత్తర్లు యిట్టమని సూడు ఎన్ని రకాల అత్తరు సీసాలు పంపాడో... యిది స్ప్రే.. యిది తలకు రాసుకునే నూనె.. నీజుట్టు మా సిన్నతనంలో ఎంత బారుగా ఉండేదో... యిప్పుడు బాగా వూడిపోయిందని ఆడు ఎన్నిమార్లు దిగులు పడ్డాడో. యిది రాసుకుంటే మంచి వాసన్తోపాటు జుట్టు రాలడం తగ్గుద్ది. ఈ కర్జూరాలు రోజుకు నాలుగు తినమన్నాడు. బలం కోసరం అట"

"అమ్మో ఎన్ని పంపించాడో... మా ఖాజా అన్నకి వాల్లమ్మంటే ఎంత పేమో" అంది దుర్గ.

"యింకా ఉన్నాయి" అంటూ ముత్తయ్య సూట్ కేస్ అడుగులోంచి రెండు కవర్లు తీశాడు. "యిందులో డబ్బులు పెట్టాడట. ఓ కవర్లో డబ్బు నీ మందులకోసరం... రెండో కవర్లో డబ్బులు యింటి కర్సుల కోసరం"

బూబమ్మ డబ్బులున్న కవర్లని పక్కన పెట్టి కొడుకు పంపించిన రగ్గు, స్వెట్టరు. చీరలు... వాటిని ఆప్యాయంగా నిమిరింది. తన కొడుకు పాలు తాగే వయసులో వాడి శరీరాన్ని నిమిరితే ఎంతో మెత్తగా హాయిగా ఉండేది. అలాంటి అనుభూతే యిప్పుడూ... ఆమె కన్నీళ్ళు ఆర్ద్రంగా వాటిని కౌగిలించుకున్నాయి.

"యియన్నీ సరే. ఆడెందుకు రాలేదో సెప్పు" అంది. ముత్తయ్య కళ్ళకి ఆమె మారాం చేసే పసిపిల్లలా కన్పించింది.

"పెద్దమ్మా... రానుపోను సార్జీలు... రెండు వారాల కూలీ నట్టం... మిగతా కర్సులు.. యియన్నీ కలుపుకుంటే బోలెడు డబ్బులు తేల్తాయి. నీ ఆపరేషన్ కోసరం ఆడు డబ్బులు పంపి అర్నెల్లు కూడా కాలేదే... అది వూడ్సుకోవద్దా సెప్పు. ఆడక్కడున్నా ఆడి పేనమంతా నీ మీదే ఉంటది పెద్దమ్మా. 'మా అమ్మీ ఎప్పట్లా ఆరోగ్యంగా తిరగాడితే సాలు. నేనింకేం కోరుకోను' అని ఎన్ని మార్లన్నాడో నాతో. నమాజులో కూడా రోజూ అల్లాని అదే

అడుగుతాడు పెద్దమ్మా"

బూబమ్మని ఒక్కసారిగా దుఃఖమేఘమేదో కమ్మేసింది. ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది. తెరలు తెరలుగా ఏడ్చింది. కన్న పేగు కదిలి కదిలి ఏడ్చింది. ముత్తయ్య సముదాయింపుతో కొద్దిగా తేరుకుంది.

"యింతకీ ఆడెలా ఉన్నాడు బాబూ?" అంది.

"ఆడికేం పెద్దమ్మా... బానే ఉన్నాడు. మేం కలిసేగా ఉండేది. ఆడికేమైనా కట్టం కలిగితే నేను తట్టుకోగల్నా పెద్దమ్మా... సిన్నప్పట్నుండీ పేనంలో పేనంలా కల్సి బతికాం. కల్సే గోలీకాయలాడాం. కల్సే సీట్లపేకలాడాం. సివరికి కల్సే బతుకు తెరువు ఎతుక్కుంటా దుబాయ్ ఎల్లాం. ఆడికి నీ గురించి దిగులు తప్ప మరే కట్టమూ లేదు పెద్దమ్మా... మర్సేపోయాను. ఆడూ నేనూ కల్సి తీయించుకున్న పొటోలున్నాయి. సూపిత్తానుండు" అంటూ మరో సూట్‌కేస్‌లోంచి ఫోటో ఆల్బం తీశాడు.

"యిది జుమెరా మసీదు. యిందులో ఒకేమారు ఎయ్యిమందికి పైగా నమాజు సదూతారు. నెత్తిమీద టోపీతో మన ఖాజా సూశావా. నమాజ్ సదివొచ్చాక దిగిన పొటో. మొత్తం పాలరాత్తో కట్టారు. యిది అల్‌పాహిదా కోట. నూటేబై యేల్లనాటి పాత కోట. యిక్కడ టక్‌సేస్కుని, నల్ల కల్లద్దాలెట్టుకుని నిలబడిఉన్నాడే... గుర్తు పట్టావా... మన ఖాజానే. అచ్చం హిందీ సినిమాల్లో ఈరోలా లేడూ? యిది దుబాయ్ మద్యగుండా పోతున్న సముద్రపు పాయ. దాదాపు పది పన్నెండు కిలోమీటర్ల పొడవుంటది. దీనికటువైపుది పాత దుబాయ్ యిటు వైపుది కొత్త దుబాయ్. ఈ బ్రిడ్జి ఆ రెంటినీ కలుపుతుంది. దానిపైన నిలబడి ఆకాశంలోకి సూస్తున్న కుర్రాడు... మన ఖాజానే"

బూబమ్మ తన కొడుకు దిగిన ఫొటోల్ని ఆప్యాయంగా చూసుకుంది. దుబాయ్ వెళ్ళాక రంగు తగ్గినట్టున్నాడు. కొద్దిగా సన్నబడ్డాడు కూడా.

"ఎర్రటి ఎండ కదా పెద్దమ్మా. యిసుక ఎడారే ఎటు సూసినా. మంచినీల్ల కరువు. పెట్రోలే సవుక మంచినీల్లకన్నా. మన తిండి దొరకదాయె. అలాకాక మరెలా ఉంటాం సెప్పు" అన్నాడు ముత్తయ్య.

బూబమ్మ ముత్తయ్య వైపు పరిశీలనగా చూసింది. ముత్తయ్య కూడా చిక్కాడు. చామన చాయలో ఉండేటోడు నల్లబడ్డాడు.

"నా కొడుకు దిగిన పొటో ఒకటియ్యి. యింట్లో గోడకి తగిలిచ్చి సూస్కుంటా"

"నువ్విలా అడుగుతావని ఖాజాకి తెల్వబట్టే ఓ పొటోని ఫ్రేం కట్టించి యిచ్చాడు. యియన్నీ యింకో బ్యాగ్‌లో పెట్టిస్తానుండు" అంటూ అన్నీ ఓ బ్యాగ్‌లో సర్ది "పద పెద్దమ్మా. యింటికాడదాకా వత్తాను" అన్నాడు.

యింట్లో బూబమ్మని దింపి, కొద్దిసేపు దుబాయ్ కబుర్లు చెప్పి ముత్తయ్య వెళ్ళిపోయాడు.

బూబమ్మ తన కొడుకు పంపించిన వస్తువులన్నీ తీసి మంచం మీద పర్చుకుంది. ఓ చివరగా పడుకుని, తన పక్కనున్న వస్తువులమీద చేయి వేసింది. పదేళ్ళప్పుడు తన పక్కలో ముడుచుకుని పడుకున్న ఖాజా మీద చేయివేసిన అనుభూతి... వాడికి తనంటే ఎంత ప్రేమో.. తనకిష్టమైన రంగు చీరలే పంపాడు. అత్తరు సువాసనలంటే తనకెంత పిచ్చో... ఈ మధ్య అనారోగ్యం వల్ల ఆసక్తి తగ్గింది కానీ... ఆ మాయదారి రోగం తనకే రావాలా... దాని వల్లే కదూ తన కొడుకు నీళ్ళులేని ఎడారిలో కాయకష్టం చేస్తున్నాడు.. దాని వల్లనే తన కొడుకు దేశం కాని దేశానికి వలస పోయింది...

ఖాజా కంటే ముందు నలుగురు ఆడపిల్లలు. ఖాజాకి నాలుగేళ్ళ వయసులో వాళ్ళ నాన్న క్షయవ్యాధితో చనిపోయాడు. అతను పన్చేసిన పొగాక్కంపెనీలోనే బూబమ్మకి గ్రేడింగ్ పని దొరికింది. ఆ వచ్చిన కాసిని డబ్బుల్తోనే పిల్లల్ని సాకి సంతరించింది. నలుగురు ఆడపిల్లలకి ఉన్నంతలోనే సంబంధాలు చూసి పెళ్ళి చేసింది. అల్లుళ్ళు తనలానే కూలినాలి చేసుకుని బతికేటోళ్ళే. ఖాజాకి చదువు ఒంటబట్టలేదు. తండ్రి అజమాయిషీ లేకపోవడం, తల్లి పగలంతా పన్లోకి వెళ్ళటం వల్ల తన ఈడు పిల్లల్తో కలిసి ఆవారాగా తిరిగేటోడు.

వాడికి ముత్తయ్య సావాసగాడు. ముత్తయ్య బర్రెగొడ్లు కాయడానికెళ్ళేటోడు. ఖాజా వాడికి తోడు. తను పన్లోంచి యింటికి వచ్చేదాకా ఖాజా గడపలో కూచుని ఎదురు చూసేటోడు. అక్కలు బువ్వకి పిల్చినా తినేవాడు కాదు. తను వచ్చాక తనతోపాటు కూచుని తినేటోడు. తనెప్పుడైనా మనసు బాగోలేక తినకపోతే వూర్కునేవాడు కాదు. తను తినే వరకు వాడూ తినకుండా మొండికేసి కూచునేటోడు. ఆదివారం వస్తే చాలు ముత్తయ్య తమ యింట్లోనే ఉండేటోడు. తను కంచంలో బువ్వ కలిపి యిద్దరికీ ముద్దలు తిన్పించేది. 'పెద్దమ్మా. నువ్వేది పెట్టినా ఎంత రుసిగా ఉంటదో' అనేవాడు ముత్తయ్య.

వయసొచ్చాక యిద్దరూ యిటుకలబట్టీలో పనికి కుదుర్చుకున్నారు. ఆ ఏడాది ముత్తయ్యకి పెళ్ళయింది.తను ఖాజాకి కూడా సంబంధాలు వెతికే పనిలో పడింది. ఓ రోజు పేర్నమిట్టలో సంబంధం చూట్టానికి వెళ్ళి తిరిగి రాగానే తను కళ్ళు తిరిగి పడిపోయింది. ముత్తయ్యా ఖాజా కలిసి ఆస్పత్రికి పిల్చుకెళ్ళారు. అప్పుడు తెల్సింది తనకు గర్భాశయ క్యాన్సరని. అప్పటివరకూ ఎప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ ఉండే ఖాజాలో నవ్వు మాయమైంది.

ఆపరేషన్ చేయాల్సి వస్తుందనీ, రెండు మూడు లక్షల వరకూ ఖర్చు కావొచ్చనీ డాక్టర్లు చెప్పారట. అప్పటినుండీ అంత డబ్బు ఎలా సంపాదించాలనే దానిమీదే వాడి ధ్యాస. ఓ రోజు తనుమంచంలో పడుకుని ఉంటే వచ్చి కాళ్ళ దగ్గర కూచున్నాడు.

'మా... నేను దుబాయ్ ఎల్దామనుకుంటున్నా' అన్నాడు. తన గుండెల్లో రాయి పడింది.

'వద్దు బేటా... నన్నొదిలి ఎక్కడికీ వెళ్లొద్దు. నిన్ను సూడకుండా నేను బతకలేను' అంది.

'మా... నేను ఎల్లేదే నిన్ను బతికించుకోడానికి. నీ మందులకీ ఆపరేషన్‌కీ సరిపడా డబ్బులు సంపాయించుకోగానే తిరిగొచ్చేత్తాను. అక్కడ యిల్లు కట్టే పనివాల్లు కావాలట. కూలి బాగా ముడ్తుందట మా. అక్కడి ఒక దిర్హమ్ మన పన్నెండు రూపాయల్తో సమానమట. ముత్తయ్య ఏజెంట్‌తో మాట్లాడాడు.'

'నామాటినుబేటా. నువ్వా వూరుకాని వూర్లో కట్టాలు పడ్తుంటే నేనిక్కడ సుకంగా ఎలా ఉండగలను? నన్నొదిలిపోకు బేటా. కలోగంజో తాగినా పర్లేదు. నా పేనం ఉన్నంతకాలం నువ్వు నా కల్లెదురుగా ఉండాల. నా పేనం నీ సేతులమీదుగా పోవాల.'

'అట్లా అనమాకమ్మా..యిన్నాల్లూ నాకోసరం దీదీల కోసరం రెక్కలు ముక్కలు సేస్కున్నావు. నీ కోసరం ఆ మాత్తరం కట్టపడలేనా.. తప్పదు మా... నిన్ను కాపాడుకోవాలంటే డబ్బుకావాల. డబ్బు కావాల్నంటే దుబాయ్ ఎల్లాల. ముత్తయ్య కూడా వత్తానన్నాడు. తోడుంటాడు. కాదనకు మా' అన్నాడు కాళ్ళని చుట్టుకుని ఏడుస్తూ..

ఆపరేషన్‌కి సరిపడా డబ్బులు పంపడానికి వాడికి ఒకటిన్నర యేళ్ళు పట్టింది. ఆపరేషన్ సజావుగానే జరిగిందని డాక్టరమ్మ చెప్పింది. కానీ రెండు మూడేళ్ళ వరకు మందులు వాడాల్సిందేననీ ఆర్నెల్లకోమారు చెకప్ చేయించుకోవాలని చెప్పింది.

జరిగిన విషయాలన్నీ తల్చుకుని ఆమెకు ఏడుపొచ్చింది. ఈ రోగం వచ్చినట్లు తెలీకుండా ఉన్నా బావుండేది. ఈ పాటికి ఖాజాకి నిఖా జరిగిపోయి ఓ పాపో బాబో పుట్టి ఉండేవారు. తను హాయిగా మనవడితోనో మనవరాలితోనో ఆడుకుంటూ ఉండేది. అల్లా దయామయుడు. తొందర్లోనే తన కోరిక తీరుస్తాడు. యింకో ఏడాది... అంతే. ఖాజా తిరిగొచ్చేస్తాడు. తన యిల్లూ మళ్ళా పిల్లా పాపల్తో కళకళలాడ్తుంది.

ముత్తయ్య తిరిగెళ్తున్నపుడు వద్దన్నా వినకుండా బస్టాండ్ కెళ్ళింది బూబమ్మ.

“ఆడ్ని తొరగా రమ్మని సెప్పయ్యా. ఆడ్ని సూడకుండానే పేనం పోతుందేమోనని ఈ మద్దెన బయమేత్తోంది” అంది.

“అట్టా మాట్టాడబాక పెద్దమ్మా. నువ్వు సేయాల్సిన పన్లు శానా ఉన్నాయ్. ఖాజా పెల్లి సేయాల. ఆడి పిల్లల్ని సాకాల. నా పిలకాయల్ని సూడాల. నువ్వు నిండా నూరేల్లు బతుకుతావు పెద్దమ్మా. ఐనా నీ పేనం పోతుంటే ఖాజా సూస్తూ వూర్కుంటాడనుకున్నావా... మీ అల్లాతో పోట్లాడి నిన్ను ఎనక్కి తెచ్చుకుంటాడు” అన్నాడు ముత్తయ్య.

ముత్తయ్య దుబాయ్ తిరిగెళ్ళిన పది నెల్లకి బూబమ్మకి సీరియస్‌గా ఉందని ఖాజా పేరుతో టెలిగ్రాం వచ్చింది. దుర్గ కూడా ముత్తయ్యకి టెలిగ్రాం యిచ్చింది బూబమ్మ ఇవ్వాలో రేపో అనేలా ఉందని.

టెలిగ్రాం అందిన రెండో రోజే ముత్తయ్య దిగిపోయాడు. “ఖాజా అన్న ఏడీ” అని అడిగిన దుర్గతో “వీసా దొరకలేదు. రెండ్రోజుల్లో వచ్చేత్తాడు. ఎందుకైనా మంచిదని ముందు నన్నెల్లమన్నాడు. యింతకీ బూబమ్మ ఏ ఆస్పత్రిలో ఉంది?” అన్నాడు.

“గవుర్నమెంట్ ఆస్పత్రి నుంచి నిన్ననే యింటికి తెచ్చేశారు. యిక నాబం లేదు తీస్కెల్లి పొండని అన్నారట డాకటేర్లు” అంది దుర్గ.

యిద్దరూ కలిసి బూబమ్మ యింటికెళ్ళారు. అప్పటికే యిద్దరు కూతుర్లు వచ్చి ఉన్నారు.

ముత్తయ్యని చూడగానే “ఖాజా వచ్చాడా... ఏడీ నా ఖాజా... ఏడీ నా బేటా” అంది కళ్ళనిండా ఆశ నింపుకుని.

“వత్తున్నాడు పెద్దమ్మా. మా వీసాలన్నీ యజమానికాడ కదా ఉండేది. ఖాజా వీసా

దొరకలేదట. నాది దొరికితే యిచ్చేసాడు. ఎంటనే బయల్దేరమని తను ఈలైసంత తొరగా వచ్చేత్తానని ఖాజా నన్ను పంపించాడు."

ఆ రోజంతా బూబమ్మ ఖాజాని కలవరిస్తూనే ఉంది.

మరునాడు ముత్తయ్య ఖాజాకి ఫోన్ చేశాడు. ఖాజా చేతికి వీసా వచ్చిందని, బయల్దేరాడని మరి కాసేపట్లో బొంబే వస్తాడని బూబమ్మతో చెప్పాడు ముత్తయ్య.

"ఆడ్ని సూడకుండానే సచ్చిపోతానేమో" అంది బూబమ్మ.

"అలా జరగదు పెద్దమ్మా. ఆడికి బొంబేలో యిమానం తప్పిపోయిందట. లేకపోతే ఈ కాడికి ఐద్రాబాద్ వచ్చేసేటోడు" అన్నాడు.

ఆ రాత్రికే బూబమ్మ కోమాలోకెళ్ళిపోయింది.

"ఖాజా అన్నకసలు బుద్ధుందా... కన్నతల్లి సచ్చిపోతుంటే కడసారి సూపుకైనా రావాలని తెల్వదా... యింకెపుడొత్తాడు... బూబమ్మ సచ్చిపోయేలోపల వత్తాడా... ముసిల్ది రేపటిదాకా బతుకుతుందన్న నమ్మకం లేదు" అంది దుర్గ కోపంగా.

ముత్తయ్య ఉదాసీనంగా కూచున్నాడు. "ఖాజా రాలేదు దుర్గా. అందుకే ఆడి బదులు నేనొచ్చా" అన్నాడు.

"ఎందుకని రాలేదు?"

"ఖాజా సచ్చిపోయి రెండేల్లయింది" అన్నాడు చీకట్లోకి చూస్తూ ముత్తయ్య.

ఆ మాట వినగానే పిడుగు పడ్డట్టు మ్రాన్పడిపోయింది."ఏంటీ నువ్వంటుంది?"

"మేం దుబాయ్ ఎల్లి యేడాదయి ఉంటది. అ రోజు పని సరిగ్గా సేయటం లేదని ఖాజాని మేస్త్రీ బాగా తిట్టాడు. ఆడు సరిగ్గా తినేటోడు కాదు. కడుపు మాడ్చుకునేటోడు. నేను తిట్టినా వినేటోడు కాదు. 'సంపాదనంతా నేనిలా తినేత్తే అమ్మ ఆపరేషన్ కోసరం డబ్బులెలా జమచేస్తాను? యిప్పటికే ఆలీసెమైంది. ఎంత కట్టమైనా సరే అమ్మను కాపాడుకోవాల' అనేటోడు. నీరసం, మేస్త్రీ తిట్టాడన్న దిగులు... మూడో అంతస్తుకి యిటుకలు మోస్తున్న ఖాజా కళ్ళు తిరిగి, పట్టు జారి కిందపడిపోయాడు. ఆస్పత్రికి తీసుకెళ్తుంటే మద్య దార్లోనే సచ్చిపోయాడు"

"అలాగైతే పతినెలా బూబమ్మకి డబ్బులెక్కడ్నుంచొత్తున్నాయి? ఆపరేసన్‌కి డబ్బులెవరు పంపారు?"

"నేనే.. ఖాజా సచ్చిపోయాక పెద్దమ్మకి కబురు పెడ్దామని కంపెనీ వాల్లన్నారు. నేనే వద్దన్నా. ఖాజా సచ్చిపోయాడని తెలిత్తే పెద్దమ్మ ఎప్పుడో పేనాలు వదిలేసి ఉండేది. ఖాజా కోరిక పెద్దమ్మని బతికించుకోటం. ఆడి నేస్తగాడిగా, పెద్దమ్మ సేత్తో పెట్టిన బువ్వ తిన్నోడిగా ఆమెని కాపాట్టం నా దర్మం కాదా. అందుకే ఆ నిజాన్ని పెద్దమ్మకు తెలీకుండా దాసిపెట్టా. నీకూ సెప్పలా"

"అంత డబ్బు నీకెక్కడిది?"

"అది ఖాజా డబ్బే. ఖాజా పెమాదంలో సచ్చిపోయాడు కాబట్టి నట్టపరిహారం యియ్యాలని కూలీలందరం గొడవ సేశాం. మా సేఠ్ మేం అడిగినంత కాకున్నా కొంత డబ్బుని ముట్టసెప్పడానికొప్పుకున్నాడు. ఆ డబ్బులోంచే పెద్దమ్మ ఆపరేషన్‌కి, పతినెలా పంపడానికి వాడాను"

అప్పటివరకూ అతని గుండెల్లో దాచుకున్న సంక్షుభిత దుఃఖ సముద్రాలు ఒక్కసారిగా బైటికి తన్నుకొచ్చాయి. పసిపిల్లాడిలా వెక్కి వెక్కి ఏడుస్తున్న ముత్తయ్యని ఎలా ఓదార్చాలో దుర్గకి అర్థం కాలేదు.

"దుబాయ్‌లో మాలాంటి కూలీల బతుకు రోజూ నరకం తెల్సా... ఖాజా సచ్చిపోయి బతికి పోయాడు. మేమందరం బతికుండీ సచ్చిపోయాం. అంతే తేడా" అంటూ దుర్గని చుట్టుకుని కన్నీళ్ళచెరువైనాడు.

ఉదయం కాకముందే బూబమ్మ చనిపోయింది... ముత్తయ్య చేతులమీదుగా కఫన్ లేచింది.

**(ఆంధ్రభూమి వారపత్రిక - 24 మార్చి 2011)**